ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

అన్నమయ్య

జిల్లా వార్తలు

గురువారం 21 మార్చి 2024

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- సీ విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించండి
- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 20: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ కోరారు. ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని ప్రతి ఒక్కరూ ఎంసీసీ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలు చేయడం, రెచ్చగొట్టేలా రాజకీయనేతలు ప్రవర్తించకూడదన్నారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయడం, డబ్బులు పంపిణీ చేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించకూడదన్నారు. ఎన్నికల నిర్వహణ అధికారులు సీ విజిల్ ద్వారా అందే ఫిర్యాదులపై తక్షణం స్పందించి సకాలంలో సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన సీ విజిల్, నో యువర్ కాండిడేట్, ఓటర్ హెల్ప్ లైన్ వంటి యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, వాటి ద్వారా చాలా సమాచారాన్ని పొందవచ్చునన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు పోలీస్ చెక్‌పోస్టులను తరచూ విజిట్ చేస్తూ ఉండాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నామినేషన్ సమయంలో వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ తప్పక చేయించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఏఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఆర్వో సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లె, రాజంపేట ఆర్డీవోలు రంగస్వామి, హరిప్రసాద్, మోహన్‌రావు, ఆర్వోలు, నోడల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేయాలి

- టీటీడీ ఈవో ధర్మారెడ్డి

ఒంటిమిట్ట, మార్చి 20: ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 16న అంకురార్పణ, ఏప్రిల్ 17న శ్రీరామనవమి పర్వదిన ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గల సమావేశ మందిరంలో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఏప్రిల్ 22న జరగనున్న సీతారాముల కల్యాణం ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కల్యాణం రోజున వచ్చే వేలాది మంది భక్తులకు అవసరమైన అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు భక్తులు నడిచే ప్రాంతాల్లో కూల్ పెయింట్ వేయాలని అవసరమైన చోట్ల చలువపందిళ్లు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సీతారాముల తలంబ్రాల ప్యాకింగ్‌కు 300 మంది, కల్యాణం రోజున భక్తులకు అన్నప్రసాదాలు, తలంబ్రాల పంపిణీకి దాదాపు 2 వేల మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు వీలుగా అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళిక త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. కల్యాణం రోజున భక్తుల రవాణా, వసతి, పార్కింగ్ కల్పించేందుకు ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు పూర్తి సన్నద్ధంగా ఉండి జిల్లాలోని ఆయా విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిశోర్, ఎస్వీబీసీ సీఈవో షన్ముఖ కుమార్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈలు జగదీశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎస్టేట్ ఆఫీసరు గుణభూషణ్‌రెడ్డి, డిప్యూటీ ఈవోలు నటేష్‌బాబు, ప్రశాంతి, అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైసీపీ రాక్షస ప్రభుత్వాన్ని సాగనంపాలి
- ఓటు అనే వజ్రాయుధం ద్వారా ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి
- న్యాయం గెలవాలి కార్యక్రమంలో నారా భువనేశ్వరి



రాయచోటిలో రవీంద్రరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి

కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న నారా భువనేశ్వరి



రాయచోటి, గాలివీడు, మార్చి 20: కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని.. అండగా మేముంటామని, మీకు ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని, ఇలాంటి రాక్షస ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉండాలని నారా భువనేశ్వరి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక గుండెపోటుతో మరణించిన కుటుంబాల పరామర్శలో భాగంగా నిజం గెలివాలి కార్యక్రమంలో నారా భువనేశ్వరి బుధవారం మధ్యాహ్నం గాలివీడుకు వచ్చారు. గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామం నాగన్నగుట్టపాలెంకు చెందిన మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ ప్రభాకర్‌నాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనోవేదనతో ప్రభాకర్‌నాయుడు సతీమణి రెడ్డెమ్మ మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం జగన్ పాలనపై నారా భువనేశ్వరి విరుచుకుపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు ప్రజలు అనేక రకాల సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. కక్ష్య సాధింపు చర్యలతోనే అనేక మందిని అక్రమంగా అరెస్టు చేసి మానసిక క్షోభకు గురి చేశారన్నారు. రానున్న రెండు నెలల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ధైర్యంగా నిలబడి నిర్భయంగా ఓటు వేసి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో తిష్టవేసిన అవినీతిపరులను రాయలసీమ ప్రజలు పౌరుషంగా అడ్డుకోవాలని, వారి చేతిలో నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు పాలనలో సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌గా పేరుపొందిన ఏపీ నేడు అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని వైసీపీ నిలబెట్టిందన్నారు. గతంలో ఏపీలో ఉన్న పరిశ్రమలన్నీ ఈ ప్రభుత్వం ఒత్తిళ్లు భరించలేక పక్క రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఐదేళ్లుగా అనేక ఇబ్బందులకు గురి చేశారని, ఇక మనకు మంచి రోజులు రాబోతున్నాయని తెలిపారు. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వడానికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో నాయకులు, కార్యకర్తలతో పాటు మహిళలు కూడా అలుపెరగని పోరాటం చేశారని, పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మా కుటుంబానికి అండగా నిలిచారని, ప్రతి ఒక్కరికీ మేము రుణపడి ఉంటామని తెలిపారు. నేను కూడా రాయలసీమ పౌరుషం కలిగిన బిడ్డనని ఎటువంటి భయాలకు భయపడే ప్రసక్తే లేదని వైసీపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు మీ అందరి కృషితో ముందుకు వెళతానని స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడు ప్రజలకు మేలు చేసే వ్యక్తి గానీ కీడు చేసే వ్యక్తి కాదు అని, జగన్‌మోహన్‌రెడ్డి కక్ష సాధింపుతోనే అక్రమ అరెస్టులు చేసినప్పటికీ తప్పు చేసినట్లు నిరూపించలేకపోయారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అందరూ సమష్టిగా కృషి చేసి తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాజంపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, పీలేరు, రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, గాజుల ఖాదర్‌బాషా, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో...

చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన పట్టణంలోని రాజుల కాలనీకి చెందిన రవీంద్రరాజు కుటుంబాన్ని బుధవారం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పరామర్శించారు. గత ఏడాది సెప్టెంబరు 14వ తేదీ రవీంద్రరాజు చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మృతి చెందాడు. దీంతో నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం నారా భువనేశ్వరి ఆయన ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని, ఎటువంటి ఆందోళన చెందవద్దని వారికి భరోసా ఇచ్చారు. రవీంద్రరాజు చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళర్పించారు. రవీంద్రరాజు కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడారు. భువనేశ్వరి రాక సందర్భంగా పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



గాలివీడులో రెడ్డెమ్మ కుటుంబ సభ్యులతో నారా భువనేశ్వరి



రవీంద్రరాజు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న నారా భువనేశ్వరి.. చిత్రంలో జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

గజ వాహనంపై లక్ష్మీనరసింహుడు

గుర్రంకొండ, మార్చి 20: తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు గజవాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, పంచామృతాలతో అభిషేకాలను ఘనంగా నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంలో ఉంచి ప్రత్యేక పూజలను నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం స్వామి వారికి ఊంజల్‌సేవను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి గజవాహనంపై అధిరోహింజేసి భక్తులకు దర్శమిచ్చారు. గజవాహనంపై ఆశీనులైన స్వామి వారు పురవీధుల్లో విహరిస్తున్న భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవాన్ని టీటీడీ వేద పండితులు కన్నులపండుగలా నిర్వహించనున్నారు. అనంతరం స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.



ఊంజల్ సేవలో స్వామి వారు

ఆక్రమణలకు అడ్డే లేదు..

- గుట్టలు తొలచి.. కంచెలు వేసి దర్జాగా కబ్జా
- విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ




హెచ్చరిక బోర్డు నాటుతున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

ఓబులవారిపల్లె, మార్చి 20: మండలంలోని పెద్దఓరంపాడు కబ్జాదారులకు కల్పతరువుగా మారింది. ఇక్కడ ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉండటంతో భూకబ్జాదారులకు అడ్డే లేకుండాపోతోంది. కొండలు, గుట్టలు కొల్లగొట్టి అడవిలా ఉన్న ప్రభుత్వ భూములను ఎంచక్కా సాగులోకి తీసుకువచ్చి ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్నట్లు ముళ్లకంచెను సైతం ఏర్పాటు చేసుకుని పంటలు పండించుకుంటున్నారు. పెద్దఓరంపాడు రెవెన్యూ గ్రామ పరిధిలో పెరుమాళ్లపల్లె గ్రామ సరిహద్దుల్లో సర్వే నెంబరు 1150లో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని గతంలో పనిచేసిన కొంతమంది మండల రెవెన్యూ అధికారుల ద్వారా అక్రమమార్గంలో కొందరు వారి పేర్లపైన ఆన్‌లైన్ చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ సర్వే నెంబరులో ఉన్న మిగిలిన భూమిని కొంతమంది ఎలాంటి అనుమతులు, ప్రభుత్వ పట్టాలు, ఆన్‌లైన్‌లో నమోదు కూడా లేకుండా స్వాధీనపరుచుకునేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే 25, 33, 25, 35, 25, 39 సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని సుమారు 20 ఎకరాల వరకు ఇదే విధంగా అక్రమమార్గాల్లో స్వాధీనం చేసుకుని లక్షలాది రూపాయలకు అమ్మకాలు చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జనవరి నెలలో యంత్రాలతో వారం రోజులు పాటు రాత్రి పగలు తేడా లేకుండా గుట్టలు చదును చేశారు. మీకు ఏ హక్కులు ఉన్నాయని ఇలా భూమి చదును చేస్తున్నారని గ్రామస్థులు ఆక్రమణదారులను ప్రశ్నించగా మాకు రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని, అడగడానికి మీరెవరని, మీ అంతు చూస్తామంటూ వేట కొడవళ్లతో భయభ్రాంతులకు గురి చేశారని గ్రామస్థులు తెలిపారు. దీనిపైన పత్రికలలో వార్తలు కూడా వచ్చాయి. ఈ ఘటనపై ఏ ప్రభుత్వ అధికారి కూడా చర్యలు తీసుకోకపోగా కనీసం ఆరా కూడా తీయలేదని చెబుతున్నారు. దీనిపై మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా స్థానిక రెవెన్యూ అధికారులను పంపి జనవరి 12న ప్రభుత్వ హెచ్చరిక బోర్డును నాటించారు. అందులో ఉన్న కొన్ని మామిడి మొక్కలను కూడా రెవెన్యూ సిబ్బంది పీకి వేశారు. అయితే హెచ్చరిక బోర్డు నాటిన మరుసటి రోజే దానిని పీకేసి అదే పొలంలో మొక్కలు నాటేందుకు సిద్ధమ య్యారు. అలాగే పొలం చుట్టూ ముళ్లకంచె ఏర్పాటు చేసే విధంగా గుంతలు తవ్వగా వెంటనే గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయినా వారు స్పందించకపోవడంతో ఆక్రమణదారుడు ఫెన్సింగ్ వేసి షెడ్లు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆక్రమణదారులకు ఎలాంటి పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ ప్రభుత్వ పట్టాలు మంజూరు చేయకపోయినా కూడా ఆ పొలాలకు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఏర్పాటు చేశారు. దీంతో దర్జాగా బోరు వేసుకుని సాగు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. అలాగే 1150 సర్వే నెంబరులోని కొద్దిమంది ఎస్సీలకు కూడా ఉండటంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మరొక వ్యక్తి వారి నుంచి కొనుగోలు చేసి సాగుకు ట్రాన్స్‌ఫార్మర్లు, బోరు వంటివి ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటిపై మండల స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని జనవరి 22వ తేదీ రెవెన్యూ డివిజన్ అధికారికి గ్రామస్థులు అర్జీ ఇచ్చారని, అయితే అర్జీదారులు అక్కడ ఉండగానే తహశీల్దారుకు ఫోన్ చేసి వీటిపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించినట్లు తెలిపారు.

అయితే ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఆక్రమణదారులకే అండగా నిలుస్తున్నట్లు వారు చేపట్టే పనులను బట్టి అర్థమవుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. 1150 సర్వే నెంబరులో బోర్లు వేయడం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం పైన విద్యుత్ శాఖ ఏఈ, డీఈలను అడగ్గా ఆక్రమణదారులకు సంబంధించిన పేర్లపైన ఎలాంటి అర్జీలు కానీ, వారి పేరున విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కొరకు దరఖాస్తులు చేయలేదని తెలిపారు. అవి విద్యుత్ శాఖ కాంట్రాక్టు పనులు చేపట్టే వారి వద్ద నుంచి కొనుగోలు చేసి దొంగతనంగా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన వివరాలను సైతం వారి లిస్టులో పరిశీలించారు. ఆక్రమణదారులు చేపడుతున్న ప్రతి పనులపైన రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా కఠిన చర్యలు తీసుకోకపోవడానికి రాజకీయ నాయకులు, ఆక్రమణదారులతో ఎలాంటి చీకటి ఒప్పందాలు చేసుకున్నారో తెలియడం లేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై జిల్లా స్థాయి అధికారులు గమనించాలని స్థానికులు కోరుతున్నారు. భూఆక్రమణదారుల చెర నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని భూములు లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అందించాలని చుట్టుపక్కల గ్రామ ప్రజలు కోరుతున్నారు.



బోర్డు పీకేసి ఫెన్సింగ్ వేసేందుకు తీసిన గుంతలు



అప్పట్లో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు (ఫైల్)

వీఆర్వో, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశాం..

1150 సర్వే నెంబర్‌లో ఎలాంటి హక్కులు లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని వీఆర్వో, తహసీల్దారుకు ఫిర్యాదు చేశాం. వారు పట్టించుకోకపోవడంతో రెవెన్యూ డివిజన్ అధికారి, జాయింట్ కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశాం. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి.

- వెంకటనరసయ్య

అధికారం ఉంటే ఏమైనా చేస్తారా..

పాసుబుక్కులు వారి పేరుపై లేవు. ఆన్‌లైన్‌లో లేదు. ప్రభుత్వం ఇవ్వలేదు. అయినా వారికి భూములు, బోర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎలా ఏర్పాటు చేస్తారు. డబ్బు, అధికారం ఉంటే ఏమైనా చెయ్యొచ్చా...?

- ఎం.నాగరాజు

సమస్య నా దృష్టికి రాలేదు..

నేను 10 రోజుల కిందటే నూతనంగా బాధ్యతలు స్వీకరించాను. ప్రభుత్వ భూముల ఆక్రమణ విషయాలు నా దృష్టికి రాలేదు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి తగు చర్యలు తీసుకుంటాం. ఏదేమైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదు.

- శేషగిరిరావు, తహసీల్దారు

టీచర్ మాకొద్దని నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



ఆ టీచర్ మాకొద్దు..

- సస్పెన్షన్ అయినా మళ్లీ ఆదే స్కూల్‌కు..
- నిరసన చేపట్టిన విద్యార్థులు, తల్లిదండులు
- ఆ టీచర్ ఉంటే ఆత్మహత్యకు పాల్పడతానన్న విద్యార్థి తండ్రి

మదనపల్లె అర్బన్, మార్చి 20: విద్యార్థులకు చదువు చెప్పకుండా తప్పుదారి పట్టిస్తున్న ఆ టీచర్ మాకొద్దని మదనపల్లె మండలం కొండామరిపల్లె గ్రామం బాలాజీనగర్‌లోని ఉర్దూ పాఠశాల కమిటీ సభ్యులు నిరసన చేపట్టారు. నాలుగు నెలల క్రితం అధికారులు మ్యాథ్స్ టీచర్ నజియత్ నఫీసాను సస్పెన్షన్ చేశారు. సస్పెన్షన్ సమయం అయిపోవడంతో తిరిగి బుధవారం ఆమె అదే పాఠశాలకు రావడంతో స్కూల్ కమిటీ చైర్మన్ ఎస్.మున్వర్‌బాషా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకుని ఆమెను అక్కడ నుంచి పంపించి వేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన ర్యాలీ, ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా స్కూల్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ టీచర్ వద్దని రెండేళ్లుగా పోరాటాలు, ఆందోళనలు చేయడంతో ఉన్నతాధికారులతో త్రిసభ్య కమిటీ వేసి విచారణ చేయించి నాలుగు నెలల క్రితం సస్పెన్షన్ చేశారని తెలిపారు. అయితే సస్పెన్షన్ పూర్తి చేసుకుని జిల్లా ఉన్నతాధికారుల రెకమెండేషన్‌తో తిరిగి ఇదే పాఠశాలకే ఉపాధ్యాయురాలిగా రావడం దారుణమన్నారు. ఆ టీచర్ పనిచేసిన సమయంలో మ్యాథ్స్‌లో చాలా వరకు విద్యార్థులు ఫెయిలయ్యారని గుర్తు చేశారు. విద్యార్థులకు అసభ్యకరమైన మాటలు, సెల్‌ఫోన్‌లో అసభ్యకర పోస్టులు చూపుతుండడంతో వయస్సులో ఉన్న విద్యార్థులు చెడుదారి పట్టారని ఆరోపించారు. ఐదుమంది బాలికలను తన మాటల మాయలో పడేసి వారు చదువుకోకుండా చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు వివాహాలు చేయాల్సిన పరిస్థితికి తీసుకొచ్చిందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇలాంటి టీచర్‌ను మళ్లీ ఈ పాఠశాలకు వేశారని, ఆమె వస్తే తాను విద్యార్థుల కోసం కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని సయ్యద్ కౌసర్ కిరోసిన్ క్యాన్‌తో ప్రయత్నించాడు, అక్కడే ఉన్న స్కూల్ కమిటీ సభ్యులు ఆయనను అడ్డుకున్నారు. మాయదారి టీచర్‌ను ఈ పాఠశాలలో అడుగు పెట్టనివ్వమని, కాదని వస్తే పాఠశాల్లోని పిల్లలను వేరే పాఠశాలల్లో చేర్పించి పాఠశాల మూసేస్తామని హెచ్చరించారు. అలా జరిగితే పేద విద్యార్థులకు పాఠశాల లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంగా మదనపల్లె డీవైఈవోను వివరణ కోరగా ఆ టీచర్‌కు పోస్టింగ్ ఇచ్చినట్లు తనకు తెలియదని ఆయన తెలిపారు. నిరసన కార్యక్రమంలో స్కూల్ కమిటీ సభ్యులు రజియా, సాహినా, సయ్యద్ సబ్రీన్, ఎస్ కరీముల్లా, కౌసర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉర్దూ స్కూల్ వద్ద ఆత్మహత్యకు యత్నిస్తున్న సయ్యద్ కౌసర్

వైవీయూ పరిశోధక విద్యార్థికి

రూ.30 లక్షల ఫెలోషిప్



ఫెలోషిప్ అందిస్తున్న చింతా సుధాకర్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20 : వైవీయూ జియాలజీ శాఖ జీఎస్టీ ఇన్‌స్పైర్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసిన ప్రదీప్‌కుమార్‌కు భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బోర్డు నేషనల్ ఫెలోషిప్ కింద పరిశోధన కోసం రూ.30 లక్షలు ఫెలోషిప్ మంజూరు చేశారు. క్లైమెట్ ఛేంజ్, ఇంపాక్ట్ ల్యాండ్, ల్యాండ్ డిగ్రేడేషన్ అనే అంశంపై పరిశోధనలు చేయడం కోసం నేషనల్ జియోఎపిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్త డాక్టర్ చక్రం మార్గదర్శకంలో ఈ పరిశోధన చేయబోతున్నారు. యూనివర్శిటీలో ప్రొఫెసరు రఘుబాబు మార్గదర్శకంలో ప్రదీప్‌కుమార్ ఇది వరకే పీహెచ్‌డీ పూర్తి చేశారు. వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, ప్రొఫెసరు క్రిష్టారెడ్డి, జియాలజీ అధ్యాపక బృందం ప్రదీప్‌కుమార్‌ను అభినందించారు.

ఫొటోగ్రఫీలో ఏఎఫ్‌ఏయూ విద్యార్థికి బహుమతి



నగదు, ప్రశంసాపత్రం అందుకుంటున్న తేజస్విని, బహుమతి పొందిన చిత్రం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ ఫొటోగ్రఫీ విభాగం నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తేజస్వినికి రాష్ట్రస్థాయిలో మూడో బహమతి లభించింది. హైదరాబాదులో గత ఏడాది డిసెంబరులో తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో కాసు బ్రహ్మానందరెడ్డి నేషనల్ పార్కు. 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేబీఆర్ త్రూ కెమెరా ఐష్ అనే సీన్‌తో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో తేజస్వినిని తీసిన చిత్రానికి తృతీయ బహుమతి లభించింది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఎంటీ పార్గయిన్ చేతుల మీదుగా రూ.5 వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారు. విద్యార్థి ప్రతిభ పట్ల వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ సురేంద్రనాథరెడ్డి, ఫొటోగ్రఫీ విభాగం సమన్వయకర్త సంపత్‌కుమార్ తేజస్వినిని అభినందించారు.

23న కడప ప్రభుత్వ ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20 : కడప నగరం ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 23న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డీఎల్‌టీసీ అసిస్టెంటు డైరెక్టరు రత్నరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఐటీఐ చదువుతున్న విద్యార్థులు పార్ట్‌టైం కంప్యూటర్ కోర్సు మూడు నెలలు చేసిన విద్యార్థులు, డిగ్రీ, ఇంటర్ చదివిన వారు ఈ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. సెలక్టు అయిన విద్యార్థులకు 55 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని.. నెలకు రూ.13 వేల నుంచి 22 వేల వరకు జీతం చెల్లిస్తారన్నారు. అలాగే సెలక్ట్ అయిన వారు హైదరాబాదు, బెంగళూరు, చెన్నైలలో ఉద్యోగాలు చేయాలన్నారు. అర్హత కలిగిన వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఐటీఐ మార్కుల జాబితా సర్టిఫికెట్లు. ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంటు పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రెజ్యూమ్ తీసుకుని హాజరు కావాలన్నారు

ఇద్దరిపై బైండోవర్ కేసులు

ఎర్రగుంట్ల, మార్చి 20: సోషల్ మీడియాలో ఎన్నికల కమిషన్ నియమావళికి విరుద్ధంగా పోస్టింగ్స్ పెట్టారనే విషయంపై ఇద్దరిపై బుధవారం బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తికి చెందిన వైసీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, టీడీపీకి చెందిన కుమార్‌నాయుడు ఒకరిపై ఒకరు విమర్శించుకుంటూ, వారి నాయకులను పేర్లను ఉటంకిస్తూ పోస్టింగ్స్ పెట్టుకున్నారని సీఐ ఈశ్వరయ్య తెలిపారు. వారిపై తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎవరైనా సరే ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నడుచుకుంటే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా రాయకీయ నాయకుల అనుచరులు గ్రూప్స్‌లో పోస్టింగ్స్‌పై పోలీసు నిఘా ఉంచినట్లు సమాచారం. ప్రతి గ్రూప్ అడ్మిన్‌ను బాధ్యుడిని చేస్తూ తమ చర్యలుంటాయని పోలీసు వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఎర్రగుంట్ల మండలంలో ఇది మొదటి నియమావళి ఉల్లంఘన కేసుగా చెబుతున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

సికెదిన్నె, మార్చి 20: ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం మేనేజ్‌మెంట్ స్టడీ కేఎల్ఎం మహిళా కళాశాలలో ఎంబీఏ చదువుతున్న విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో తమ ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమణి తెలిపారు. ఎంబీఏ చివరి సంవత్సరం చదివే విద్యార్థులకు ప్రముఖ కంపెనీ డేమియంరీసెర్చ్ పూణే కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తొమ్మిది మంది ఎంపికైనట్లు తెలిపారు. వారికి ట్రైనింగ్ పీరియడ్‌లో ఏడాదికి రూ.2.50 లక్షలు వేతనం ఉంటుందని, ఎంబీఏ ఉత్తీర్ణత అయిన వెంటనే కంపెనీలో జాయిన్ కావచ్చునని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ మదన్‌మోహన్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, ఏవో కిరణ్‌కుమార్ అభినందించారు.

ఏపీపీటీడీ కార్మిక పరిషత్ కడప రీజనల్ కమిటీ రద్దు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: కడప జిల్లాలో రీజనల్ కమిటీపై పలు ఆరోపణలు రావడంతో ఆర్గనైజేషన్‌కు ఇబ్బంది కలుగుతున్నందన ప్రస్తుత రీజనల్ కమిటీని రద్దు చేసినటు ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్షుడు ఏబీజే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి కమిటీ ఏర్పాటు చేసేంతవరకు అడహక్ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. అడహక్ కమిటీలో ఏబీజేరెడ్డి, యానాదిరాజు, లచ్చన్న, రఘురాముడు, కేఆర్‌కే రెడ్డిలు ఉన్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తలకు నియామకపత్రాలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: టీడీపీ బలోపేతానికి సంబంధించి టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు పలువురు కార్యకర్తలకు వివిధ హోదాలు కల్పిస్తూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి నియామక పత్రాలను అందజేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా కత్తి రవీంద్ర, గంగవరం రాజశేఖర్‌రెడ్డి, మజ్జారి జయరాం, జిల్లా కార్యదర్శిగా బసిరెడ్డి పోల్‌రెడ్డి, నగర కోశాధికారిగా పరిటాల వెంకట్రమణయ్య, నగర ఉపాధ్యక్షులుగా పఠాన్ మన్సూర్ అలీఖాన్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులుగా గండికోట వెంకటసుబ్బయ్య, నగర్ కార్యనిర్వాహక కార్యదర్శిగా గంపా వీరయ్యలకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, మార్చి 20: ఎర్రగుంట్ల శ్రీశ్రీనగర్‌కు చెందిన పొడవుల రామక్రిష్ణ (36) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం పురుగుల మందు తాగి తన భార్యకు ఫోన్‌ద్వారా తెలిపారు. అతనిని ముందుగా ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో ప్రొద్దుటూరులోని జిల్లా వైద్యవిధాన్ పరిషత్‌కు తరలించారు. బుధవారం సాయంత్రం రామక్రిష్ణ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విచారించి కేసునమోదు చేసి, గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చాపకింద నీరులా మట్కా

- డబ్బులు పోయేదే కానీ వచ్చేది మాత్రం లేదు
- ఛిద్రమవుతున్న పేదల బతుకులు
- సాంకేతికతను వాడుతున్న నిర్వాహకులు



కడప (క్రైం), మార్చి 20: వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. రోజూ కూలీ పని చేసుకుంటేనే వారికి పూట గడిచేది. కానీ ఒకే రోజులో ఈజీగా వచ్చే డబ్బుల మీద ఆశతో మట్కాను నమ్ముకుంటూ జీవితాలు బుగ్గిపాలు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మట్కా, జూదం రోజురోజుకూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. కొంత మంది పేద, మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేసుకుని మట్కా నిర్వహిస్తూ వారిని ఉచ్చులోకి దించుతున్నారు. అయితే కూలీ పనులు చేసుకునేవారే ఎక్కువగా ఈ మట్కాకు అలవాటు పడుతున్నారు. పదికి వంద, వందకు వెయ్యి చొప్పున లాభాలు వస్తాయంటూ నిర్వాహకులు చెప్పే మాటల మాయలో పడి అమాయకులు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారు.

టెక్నాలజీ వాడుతున్న మట్కా బీటర్లు

మట్కా బీటర్లు టెక్నాలజీని వాడుకుంటున్నారు. ఒకప్పుడు మట్కా నంబర్లు చీటీలపై రాసేవారు. ఇప్పుడు చీటీలే కాకుండా సెల్‌ఫోన్ల ద్వారా ఈ దందాను కొనసాగిస్తున్నారు. మట్కా బీటర్లు గతంలో ఏదైనా ఒకచోట ఉంటూ అక్కడికి పిలిపించుకుని చీటీలు రాయిస్తుండేవారు. సెల్‌ఫోన్లు వచ్చాక పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు వీలుగా సాంకేతికత వాడుతూ మట్కా కొనసాగిస్తున్నారు. నమ్మకం ఉన్న వారికి మట్కా నెంబర్లను వాట్సప్ మెసేజ్‌ల ద్వారా పంపిస్తూ దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. కడప నగరంతో పాటు పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల, బద్వేలు, జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.



మట్కా రాసిన వారిని పట్టుకున్న చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి (ఫైల్)

డబ్బులు పోగొట్టుకునే వారే ఎక్కువ

పదికి వంద, వందకు వెయ్యి అంటూ అత్యాశతో మట్కా ఉచ్చులో పడుతూ ఈరోజు కాకపోయినా రేపైనా గెలవచ్చనే ఆశతో ఉన్నదంతా కట్టేస్తున్నారు. దీంతో మట్కాపైన సంపాదించుకునేదానికంటే పోగొట్టుకున్నదే ఎక్కువగా ఉంటుంది. ఈ మట్కా ఉచ్చులో పేదలే కాకుండా కొంతమంది నిరుద్యోగులు సైతం చిక్కుకుంటున్నట్టు సమాచారం. నగదు పోగొట్టుకోవడం తప్ప సంపాదించేదేమీ లేదని కొంతమంది నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు. అయినా సరే.. పోగొట్టుకున్న డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో ఈ మట్కా నెంబర్లపై డబ్బులు కాస్తూ ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. వీరి ఆశను నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మట్కాను రూపుమాపేందుకు ప్రత్యేక టీంలు ఉన్నప్పటికీ పాత నిర్వాహకులపైనే దృష్టి సారించడంతో ఆ మట్కా బీటర్లు మరికొందరి ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు పూర్తిస్థాయిలో నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

ఇటీవల నమోదైన కేసులు

- కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 1న ఉక్కాయపల్లె డంపింగ్ యార్డు వద్ద మట్కా రాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.32,520 నగదును సీజ్ చేశారు. అలాగే జనవరి 1న పాత బైపాస్ వద్ద మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని చిన్నచౌకు పోలీసులు అరెస్టు చేసి రూ.60వేల నగదు సీజ్ చేశారు. జనవరి 20న మరో ఇద్దరిని ప్రకాశ్‌నగర్ వద్ద అరెస్టు చేసి రూ.30వేలు సీజ్ చేశారు.
- ఫిబ్రవరిలో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో పరిధిలో ఇద్దరిని, పాత రిమ్స్ వద్ద మరో ఇద్దరిని అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు.
- తాలూకా స్టేషన్ పరిధిలో ఫిబ్రవరిలో రవీంద్ర నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని, అలాగే టూటౌన్ పరిధిలో మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇలా జనవరి నుంచి ఇప్పటి వరకు పలు మట్కా కేసుల్లో నిర్వాహకులను అరెస్టు చేసి డబ్బు స్వాధీనం చేసుకున్నారు. కడపతో పాటు ప్రొద్దుటూరు. మైదుకూరు ప్రాంతాల్లో కూడా మట్కా నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- రాజకీయ ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 20: కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, నగర కమిషనరు ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేసుకోవాలంటే పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అభ్యర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే జెండాలు, బ్యానర్లు, టోపీలు, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే అడ్వర్టైజ్మెంట్‌లకు సంబంధించి రేటింగ్‌కార్డు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పర్మిషన్ తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. సభలు సమావేశాలకు 48 గంటల ముందే పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు వివిధ రకాల యాప్‌ల కొరకు ఆన్‌లైన్‌లో సువిధ యాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అధికారులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు తెలిస్తే వెంటనే సి-విజిల్‌లో లేదా, కమాండ్ కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబరు 1950 లేదా కాల్‌సెంటర్ 08562-315672కు ఫోన్ చేయాలన్నారు. వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు

ఈవీఎంల పరిశీలన

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం పరిధిలో ఉన్న ఈవీఎం గోడౌన్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు నగర కమీషనరు ప్రవీణ్‌చంద్‌తో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా చర్యల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.హరిప్రసాద్, కానుగదానం, లక్ష్మణ రావు, మల్లిఖార్జున, చంద్రశేఖర్ తదితరులతో పాటు ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించలేదని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న చెంద్రాయుడు

మైదుకూరు రూరల్ మార్చి 20 : హుబ్లీ నుంచి క్రిష్ణపట్నంకు పోయే నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా బుధవారం గడ్డంవారిపల్లె లో కొశెట్టి చెంద్రాయుడు అనే రైతు తన పొలానికి పరిహారం ఇవ్వకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.తన పొలం రోడ్డుకు పోయినప్పటికీ అందుకు సంబంధించిన డబ్బులు రెవెన్యూ అధికారులు ఇవ్వకుండా అడుకుంటున్నారని బోరున విలపించారు. కాగా చెంద్రాయుడు మైదుకూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వీరభద్రుని ఆదాయం రూ.14 లక్షలు

చాపాడు, మార్చి 20: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామికి భక్తుల నుంచి రూ.14,07,724 ఆదాయం వచ్చినట్లు ఆ దేవస్థానం ఈవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆరు హుండీలను ఆ దేవస్థానం ఛైర్మన్ గోసుల వెంకటసుబ్బారెడ్డి కమిటీ సభ్యులు, అధికారులు లెక్కించారు. గత ఏడాది సెప్టెంబరు 23వ తేదీ నుంచి ఈరోజు వరకు వచ్చిన డబ్బులను లెక్కించినట్లు ఈవో తెలిపారు. ఈ డబ్బులను మైదుకూరులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు.

12 కేజీల గంజాయి స్వాధీనం నలుగురు అరెస్ట్

మైదుకూరు రూరల్, మార్చి 20 : స్థానిక వీణావిజయరామరాజు కాలనీలో తనిఖీలు నిర్వహిస్తుండగా 12 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. మైదుకూరు సీఐ ఏపీ మస్తాన్, ఎస్‌ఐలు మద్దిలేటి, రాజరాజేశ్వర్‌రెడ్డి మైదుకూరులో తనిఖీలు నిర్వహిస్తుండగా వీణా విజయరామరాజు కాలనీలో ఎండు గంజాయి స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

పోలీసులకు పట్టుబడిన వారిలో గొల్లపల్లెకు చెందిన మడెం సుశ్మంత్‌కుమార్, చెన్నూర్ టౌన్ లక్ష్మీనగర్‌కు చెందిన గంధం సుబ్బరాయుడు, ప్రొద్దుటూరు శ్రీనివాసనగర్‌కు చెందిన మేకల సునీల్,వీణావిజయరామరాజు కాలనీకి చెందిన సాంబరావువెంకటయ్య, మోటార్ బైకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.



విలేకరుల సమావేశంలో గంజాయి స్మగ్లర్లతో పోలీసులు

కాపీయింగ్‌కు చోటిస్తే కఠిన చర్యలు

అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



పరీక్ష కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

లక్కిరెడ్డిపల్లె, మార్చి 20: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కాపీయింగ్‌కు చోటిస్తే కఠిన చర్యలు తప్పవని, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను హెచ్చరించారు. బుధవారం స్థానిక జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలో పరీక్షా కేంద్రాలను కలెక్టర్‌తో పాటు డీఈవో ప్రకాశ్‌రెడ్డిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు చోటిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎస్‌ఐ విష్ణువర్ధన్‌ను ఆదేశించారు. కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సిబ్బందికి, పోలీసులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బరితెగించి ఆక్రమణలు, ఇసుక రవాణా

- కలెక్టర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు కలెక్టర్ ఆదేశం



కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, మార్చి 20: జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి తదితర ప్రాంతాల్లోని పెన్నానదిలో ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు. అలాగే జమ్మలమడుగు మండలంలోని పొన్నతోట ఆర్‌అండ్‌ఆర్ కాలనీ శివార్లలోని జగనన్న కాలనీలో సచివాలయం ఎదురుగా, టిడ్కో గృహాలకు ఎదురుగా అధికార అండతో స్థలాలు ఆక్రమణ చేసి ఆపై నిర్మాణాలు చేస్తున్నారని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వెంటనే విచారణ చేసి అనధికారికంగా చేపట్టిన కట్టడాలను పడగొట్టాలని ఆర్డీవో శ్రీనివాసులును ఆదేశించారు. అలాగే అక్రమంగా తరలిపోతున్న ఇసుక రవాణాపై మైనింగ్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటామని బాధితులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేకల మోహన్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి, ఎం.ఈశ్వరరెడ్డి, శ్రీనివాసులు, మల్లిలతోపాటు మరికొందరు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గాలివీడు, మార్చి 20: కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గాలివీడు గ్రామంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవెంకేశ్వరస్వామి విగ్రహ జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి మంగళస్నానాలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామి కల్యాణోత్సవాన్ని పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చక స్వాములు భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి

సంబేపల్లె, మార్చి 20: పది పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని బుధవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం అధికారులకు తెలియజేశారు. మండలంలోని సంబేపల్లె జడ్పీ హైస్కూల్, దేవపట్ల జడ్పీ హైస్కూల్, దేవపట్ల మిట్టపై గల సోషల్ వెల్ఫేర్ హైస్కూల్‌లోని సెంటర్లలో గతంలో ఒక్క బెంచీకి ఇద్దరు విద్యార్థుల చొప్పున పరీక్షకు కూర్చోబెట్టేవారు. అయితే ప్రస్తుతం మరింత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ఒక్కో బెంచీకి ఒక్కో విద్యార్థిని మాత్రమే కూర్చోబెట్టి పరీక్షలు నిర్వహిస్తుండడంతో సెంటర్లను తనిఖీ చేశారు. వీరితో పాటు డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, ఎంఈవో-1, ఎంఈవో-2లు తనిఖీలు చేపట్టారు. సంబేపల్లె ఎస్‌ఐ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షా కేంద్రం వద్ద వసతులు కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్దనే ప్రాథమిక చికిత్స కిట్టును అందుబాటులో ఉంచారు.

పెండింగ్ జీతాలను చెల్లించాలి: సీఐటీయూ


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నేతలు

రాజంపేట టౌన్, మార్చి 20: మున్సిపల్ కార్మికుల పెండింగ్ జీతాలు, సమ్మె సమయంలోని జీతాలను వెంటనే చెల్లించాలంటూ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు రామాంజులు, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు సి.రవి కుమార్‌లు మున్సిపల్ కమిషనర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు న్యాయమైన కోర్కెల కోసం గతంలో 16 రోజులు నిరవధిక సమ్మె నిర్వహించారని, అప్పటి నుంచి రెండు నెలలుగా జీతభత్యాలు అందడం లేదన్నారు. ఈ నెల 25లోగా బకాయిలను పూర్తిగా కార్మికులకు అందించాలని, లేకపోతే 26 నుంచి సమ్మెను నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రసాద్, మంగమ్మ, లక్ష్మణ్, కిరణ్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మ వార్షిక వేడుకలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

రాజంపేటటౌన్, మార్చి 20: రాజంపేట పట్టణంలోని మన్నూరులో ఉదయగిరి యల్లమ్మ ఆలయం ఏడవ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగుబాళ్లు నిర్వహించారు. అంతేకాకుండా ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఆలయంలో అమ్మవారికి గీతాలు, శ్రీ వెంకటేశ్వర బృందం, సితార ఆర్కెస్ట్రా వారిచే భజన సంకీర్తనలు ఆలపించారు. హాజరైన భక్తులకు ఉచిత అన్నదానాన్ని నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు విశేషంగా హాజరయ్యారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు క్షేమం


హరిజనవాడలో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడ కార్యక్రమం

పెనగలూరు, మార్చి 20: మనం నిత్యం తీసుకొనే ఆహారంలో ఆకుకూరలు, కాయగూరలు తప్పనిసరిగా తీసుకుంటే ఆ పౌష్టికాహారం వల్ల తల్లీబిడ్డలు అనారోగ్యాల బారిన పడకుండా క్షేమంగా ఉంటారని ఐసీడీఎస్ పెనగలూరు సెక్టారు సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. బుధవారం తిరుమలరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త భారతి అధ్యక్షతన పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు యుక్త వయస్సు బాలికలు కూడా నిత్యం ఆకుకూరలు, కాయగూరలు సేవిస్తే రక్త ప్రసరణ బాగా జరిగి ఆరోగ్యవంతంగా జీవిస్తారన్నారు. ఈ సమావేశంలో ఈ.సిద్దవరం, డి.సిద్దవరం కార్యకర్తలు విజయమ్మ, పుల్లమ్మ, సహాయకురాలు లక్ష్మీదేవి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం.. కనకరుద్రమ్మ

- 24న దేవరకొండ గుట్ట వద్ద తిరుణాల



కనకరుద్రమ్మ ఆలయం, (ఇన్‌సెట్లో) అమ్మవారి మూలవిరాట్

పుల్లంపేట, మార్చి 20: మండలంలోని పి.వి.జి.పల్లె, రామసముద్రం సరిహద్దు పంచాయతీల్లో దేవరకొండ గుట్ట వద్ద వెలసిన కనకరుద్రమ్మ అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ఇక్కడ అమ్మవారు పూజలందుకుంటున్నారు. ప్రతి ఏడు ఇక్కడ అమ్మవారికి జాతర నిర్వహిస్తారు. రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాలతో పాటు నెల్లూరు జిల్లాలోని రాపూరు, వెంకటగిరి, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి తిరుణాలకు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. కాకతీయుల కాలం నాటి నుంచి దేవరకొండ గుట్ట వద్ద కనకరుద్రమ్మకు పూజలు జరుగుతూ ఉన్నాయి. అమ్మవారి విగ్రహాన్ని పూర్తిగా బంగారంతో తయారు చేశారు. పి.వి.జి.పల్లె గ్రామానికి చెందిన వారు కాకతీయుల కాలంలో దండనాదులుగా పనిచేసేవారని చెబుతారు. ప్రతిఏడు కామపౌర్ణమిని అమ్మవారికి అంగరంగ వైభవంగా తిరుణాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ముందుగా అమ్మవారు ఊటుకూరు శివాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి అదే రోజు రాత్రి పి.వి.జి.పల్లెలో విడిది చేస్తారు. పి.వి.జి.పల్లెకు వచ్చేటప్పుడు గ్రామంలోని మహిళలు ఉపవాసంతో కనకరుద్రమ్మకు ఎదుర్కోలు నిర్వహిస్తారు. గ్రామంలోని మహిళలు తమ కోర్కెలు తీర్చుకునేందుకు పెళ్లికాని యువతుల దగ్గర నుంచి మహిళలందరూ అమ్మవారికి ఎదుర్కోలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. ఆ రోజు రాత్రి అమ్మవారు పి.వి.జి.పల్లెలో విడిది అనంతరం తెల్లవారుజామునే దేవరకొండ గుట్ట వద్దకు చేరుకుంటారు. అక్కడ ఆ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. అనంతరం అమ్మవారి తిరుణాల అంగరంగ వైభవంగా జరుగుతుంది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేస్తారు. మొక్కుబడులు ఉన్నవారు చాందిని బండ్లు కట్టి గుడి చుట్టూ తిప్పుతారు. తిరుణాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, చలివేంద్రాలు ఎక్కువగా జరుగుతాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కాగా ఆలయం ముందు భాగంలో వందేళ్ల నాటి మర్రిచెట్టు ఇప్పటికీ దర్శనమిస్తుంది. ఆ చెట్టు కిందే నాగదేవతలు పూజలందుకుంటారు. ప్రతి ఆదివారం, గురువారం నాడు ఇక్కడ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేస్తుంటారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా, సంతాన లక్ష్మిగా, ఇక్కడ కనకరుద్రమ్మ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది.

ఉపాధి సిబ్బంది ప్రచారంలో పాల్గొనద్దు

రామాపురం, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఉపాధి సిబ్బంది పాల్గొంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఉపాధి ఫీల్డ్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఫీల్డ్ సిబ్బందికి ఆయన తెలియజేశారు. కూలీల సంఖ్య పెంచాలని, నాణ్యమైన పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సురేంద్రనాధరెడ్డి, ఈసీ శ్రీకాంత్ రెడ్డి, టీఏలు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

మండిపల్లిని కలిసిన టీడీపీ నాయకులు


రాంప్రసాద్‌రెడ్డిని కలిసి మద్దతు ప్రకటిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

రాయచోటిటౌన్, మార్చి 20: రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని పలువురు కలిశారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై పూల బొకేలు ఇచ్చి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాయచోటి మండలంతో పాటు సంబేపల్లె, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, మైనార్టీలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యం'

రైల్వేకోడూరు, మార్చి 20: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ గోశాలదేవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కదిరిగాళ్ల శాంతయ్యలు తెలిపారు. బుధవారం మండలంలోని శెట్టిగుంటలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన హామీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు యూత్ ప్రెసిడెంట్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత చెడుకు దూరంగా ఉండాలి

నందలూరు, మార్చి 20: యువత చెడు అలవాట్లకు లోను కాకుండా భవిష్యత్తు పట్ల శ్రద్ధ చూపాలని ఏఎస్ఐ శంకర్‌నాయక్ యువతకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని అరవపల్లె జడ్పీ క్రీడా మైదానంలో సుమారు 100 మందికి పైగా యువకులు రోడ్డు భద్రతపై చెడు వ్యసనాలకు లోనుకాకుండా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని వివరించారు. అనంతరం ఏఎస్ఐ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందువలన యువకులు రాస్తారోకో, సభలు సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

నేడు నారా భువనేశ్వరి రాక

ఓబులవారిపల్లె, మార్చి 20: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం రైల్వేకోడూరుకు రానున్న సందర్భంగా అభిమానులు తరలిరావాలని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పిలుపునిచ్చారు. రైల్వేకోడూరుకు రానున్న సందర్భంగా ముక్కావారిపల్లె వద్దనున్న ఆంజనేయస్వామి గుడి వద్దకు టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై స్వాగతం పలకాలని కోరారు.

వారపు సంత వేలం

సుండుపల్లె, మార్చి 20: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి పార్వతమ్మ ఆధ్వర్యంలో ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు పంచాయతీ, కార్యదర్శులు, రెవెన్యూ అధికారులతో కలిసి బుధవారం వారపు సంతకు వేలంపాట నిర్వహించారు. ఇందులో భాగంగా వారపు కూరగాయల సంత వేలంపాటను ఏటిగడ్డరాచపల్లెకు చెందిన గంగరాజు రూ.17 లక్షల 55 వేలకు సొంతం చేసుకోగా, పశువుల సంత వేలంపాటను పెద్ద బలిజపల్లెకు చెందిన రెడ్డచర్ల వెంకట్రమణ రూ.7 లక్షలకు సొంతం చేసుకున్నారు. వేలంపాటలో మండల కేంద్రానికి చెందిన 13 మంది పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ చట్టం ప్రకారం తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్‌బాబు, వీఆర్‌వో రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రధాన కార్యదర్శిగా రెడ్డికృష్ణ


సాయిలోకేశ్‌తో రెడ్డికృష్ణ

పెనగలూరు, మార్చి 20: మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా వి.ఎం.పురం గ్రామానికి చెందిన కోనేటి రెడ్డికృష్ణ రాయల్‌ను అధిష్టానం బుధవారం నియమించినట్లు ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌కు, మండల అధ్యక్షుడు మన్నెం మల్లికార్జునకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పురందేశ్వరికి రుణపడి ఉంటానన్నారు.

ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేసుకోండి


ఓబనపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ బాబు

రైల్వేకోడూరు మార్చి 20: ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేసుకోవాలని రైల్వేకోడూరు సీఐ టి.బాబు తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లె పంచాయతీలోని ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు సృష్టించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రశాంత ఓటింగ్‌కు ప్రజలు సహకరించాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద కేంద్ర బలగాలు ఉంటాయని తెలిపారు.


గాలివీడు మండలం ఎగువగొట్టివీడులో రెడ్డెమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న భువనేశ్వరి


రాయచోటి పట్టణం రాజులకాలనీలో రవీంద్రరాజు కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్న భువనేశ్వరి

ఇసుకను అక్రమంగా దోచేస్తున్నారు: బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న నాగోతు రమేశ్‌నాయుడు

రాజంపేట, మార్చి 20: రాష్ట్రంలో వైసీపీ నేతలు మాండవ్య, పెన్నా, బాహుదానది పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా దోచేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయడు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఎక్కడా నదీపరివాహక ప్రాంతంలో భారీ యంత్రాలు ఉపయోగించి ఇసుకను తవ్వరాదన్న నిబంధన ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కారని ఆరోపించారు. క్వారీలకు అనుమతి లేకపోయినా యథేచ్ఛగా ఇసుకను తవ్వడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుకను తవ్వుతున్న యంత్రాలను సీజ్ చేసి, కేసులు బనాయించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు హరికృష్ణ, గుణవర్మ, వి.వి.రమణ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం


తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

సిద్దవటం, మార్చి 20: మండలంలోని వంతాటిపల్లె, జంగాలపల్లె, పెన్నా నది నుంచి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని టీడీపీ నేతలు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి నాగమునిరెడ్డి, టీడీపీ నేతలు గంజి సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మరికొందరు ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నిబంధనలకు తిలోదకాలిచ్చి అధిక సెంటీమీటర్ల లోతులో ఇసుక తవ్వకాలు జరుపుతూ కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దీని ప్రభావంతో ఇప్పటికే బోర్లు ఎండిపోతున్నాయని, వ్యవసాయ బోర్లలో నీటి శాతం చాలా వరకు తగ్గిపోయిందని, వెంటనే ఇసుక రీచ్‌లను ఆపాలని బుధవారం టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి నాగమునిరెడ్డి, టీడీపీ నేతలు గంజి సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మరికొంత మంది టీడీపీ నేతలు తహశీల్దారు మురాద్వావలికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రైతులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీకి రోడ్డు వేయండి


గిరిజన కాలనీలోని రోడ్డు దుస్థితిని చూపుతున్న సీపీఐ నేతలు

రైల్వేకోడూరు, మార్చి 20: మండలంలోని ఎస్.కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీకి రోడ్డు వేయాలని రైల్వేకోడూరు సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య డిమాండ్ చేశారు. బుధవారం రోడ్డు దుస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థులు, ప్రజలు రైల్వేకోడూరుకు రావాలంటే అనేక ఇక్కట్లు పడుతున్నారన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజశేఖర్, మహిళా సమైక్య మండల కార్యదర్శి తులసి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌బాబును కలిసిన టీడీపీ నాయకులు


ప్రసాద్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

రాయచోటిటౌన్, మార్చి 20: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా బుధవారం సుగవాసి ప్రసాద్‌బాబును గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామ టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు ప్రభాకర్‌నాయుడు, ఖాదర్‌వలి, ఆరీఫ్‌బాషా, రామచంద్ర, లోకేశ్‌నాయుడు, మహేశ్‌నాయుడు, రాంమోహన్‌నాయుడు, భానుప్రకాశ్‌నాయుడు, శ్రీహరినాయుడు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పార్టీ స్థితిగతులపై చర్చించారు.

చిన్నమండెం: మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన సుగవాసి ప్రసాద్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలో తెలుగు యువత అధ్యక్షుడు తౌహిద్‌ఖాన్, బాలచంద్రయాదవ్, తెలుగు యువత నాయకులు రాంప్రసాద్‌నాయుడు, రైస్‌మిల్ శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

రాయచోటిటౌన్, మార్చి 20: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడ వారి ఆదేశాల మేరకు మే 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ట్ స్పోర్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గౌస్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వివిధ కేంద్రాల్లో 50 వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి వివిధ క్రీడాంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 8-14 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 29న సాయంత్రం 5 గంటల్లోగా రాయచోటి పట్టణంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో దరఖాస్తులను నేరుగా అందజేయాలని సూచించారు. వివరాలకు 9440297692ను సంప్రదించాలని తెలియజేశారు.

మండల నాయకులతో మాటామంతీ


కంభాలకుంటలో నాయకులు, కార్యకర్తలతో విశ్వనాథనాయుడు

పెనగలూరు, మార్చి 20: రైల్వేకోడూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు మంగళవారం మండల వ్యాప్తంగా తిరిగి నాయకులు, కార్యకర్తలతో మాటామంతీ చేశారు. దీంతో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకుల్లో ఒకింత ఉత్సాహం వచ్చినట్లయింది. రెండు నెలల నుంచి అయోమయంలో పడిపోయిన కార్యకర్తలకు భరోసా కల్పించారు. ఈ కోవలో గతంలో తనపై మనస్తాపంతో పార్టీకి దూరంగా ఉంటున్న ఒకరిద్దరి నాయకుల ఇళ్లకు కూడా వెళ్లి గతంలో జరిగినవి అన్నీ మరిచిపోయి జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుందామని కోరారు. అధిష్ఠానం టికెట్టు ఎవరికిచ్చినా కలిసికట్టుగా పార్టీకి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు విశ్వనాథనాయుడుతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి, నెలల తరబడి పార్టీ కోసం వ్యయప్రయాసలకు ఓర్చిన వారికే టికెట్ కేటాయించాలని వారు కోరారు. ఈ మేరకు అధిష్ఠాన నిర్ణయం ప్రకారం నడుచుకుందామని ఎవరికి టికెట్టు ఇచ్చినా, వారి గెలుపుకోసం సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్, జూనియర్ నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ఓటరు జాబితా గురించి చర్చించారు. ఏదేమైనప్పటికీ అధిష్ఠాన నిర్ణయమే మనందరికీ శిరోధార్యమని అందరికీ గుర్తు చేశారు.

ఓటర్లకు అవగాహన సదస్సు

ఒంటిమిట్ట, మార్చి 20: ఓటుపై ఓటర్లకు అవగాహన సదస్సును బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఉద్దేశ్యంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు వెంకటరమణ అన్నారు. మండలాధికారులు బుధవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నిర్భయంగా తమకు నచ్చిన వారికి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు ఏప్రిల్ 15 వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాము, ఈవోపీఆర్‌డి రంగయ్య, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: ఓటు నమోదుకు మరో అవకాశాన్ని కల్పించారు. దీంతో రైల్వేకోడూరు రెవెన్యూశాఖ అధికారులు, ఎన్నికల అధికారులు బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ఎవరెవరు ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలా చేసుకోవచ్చనే విషయంపై జనసంచారం ఉన్న చోట బ్యానర్లు ఏర్పాటు చేశారు.

చిన్నమండెం: మండలంలోని కలిబండ, పడమటికోన, చిన్నర్సుపల్లె గ్రామాల్లో ఓటర్లకు అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, డ్వాక్రా మహిళలు, డ్వాక్రా సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

అమరరాజాకు జపాన్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అమరరాజా ఉద్యోగులు

రేణిగుంట, మార్చి 20: జపాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ మెయింటెనెన్స్ టీపీఎం అవార్డును అమరరాజా బ్యాటరీస్ పొందింది. అమరరాజా ఎనర్జీ, మొబిలిటీ రెండు యూనిట్లు జపాన్‌లోని టోక్యోలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రతిష్ఠాత్మకమైన టోటల్ ప్రొడక్టివ్ మెయింటెన్స్ అవార్డులను గెలుచుకుంది. ఈ అవార్డులను అమరరాజా చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ సి.నరసింహులు నాయుడు, ఇండస్ట్రియల్ డివిజన్ ఆపరేషన్స్ హెడ్ శ్రీనివాస రావు, ఆటోమోటివ్ డివిజన్ ఆపరేషన్స్ హెడ్ మునీశ్వరనాయుడు, సుభాష్, టీపీఎం కోఆర్డినేటర్ రాజేష్, బిజినెస్ హెచ్ఆర్ ఈశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడానికి, టోటల్ ప్రొడక్టివ్ మెయింటెన్స్ అమలు చేయడంతో అద్భుతంగా పనిచేస్తున్న పరిశ్రమలకు ఈ అవార్డులను అందజేస్తున్నారని, తమ కంపెనీకి ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

సభలు, ర్యాలీలు, ప్రచారాలకు అనుమతి తప్పనిరి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20: అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారాలు, సభలు, ర్యాలీలను నిర్వహించరాదని జేసీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ పార్టీల నాయకులు, ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలతో సమావేశమయ్యారు. పార్టీ నాయకులు నేరుగా ఆర్వో నుంచీ లేదా సువిధ యాప్ ద్వారా అనుమతి పొందాలని సూచించారు. లేదంటే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచార సామగ్రికి సంబంధించి ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతి పొందిన తర్వాతే పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, కరపత్రాల ముద్రణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అరుణ, సమాచారశాఖ డీఐపీఆర్ పద్మజ, డీపీవో లక్ష్మి, ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీరు రాజీనామా

కార్వేటినగరం, మార్చి 20: కార్వేటినగరం మండలం సురేంద్రనగరంలో వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీరు రఫీ ఉన్నారు. ఇతడిపై అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీనిపై విచారించి అధికారులు వేటు వేస్తారని భావించిన ఆ వలంటీరు వలంటీరు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పంచాయతీ ఈవో మణికి అందజేశారు.

వాహనసేవలో అపశ్రుతి : యువకుడి మృతి



గోపీకృష్ణ (ఫైల్‌ఫొటో)

నగరి, మార్చి 20: నగరి పట్టణ పరిధి సత్రవాడలోని చిదంబరేశ్వస్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం అధికార నందివాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనం అదుపు తప్పడంతో దాని కింద పడిన గోపీకృష్ణ(18) తీవ్రంగా గాయపడినట్లు సీఐ సురేష్ తెలిపారు. స్థానికంగా ప్రథమచికిత్స అందించి తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం గోపీకృష్ణ మృతి చెందాడు. ఇటీవల ఇతడు ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు రాశారు. ఇతడి మృతితో స్థానికంగా విషాదఛాయలు నెలకొన్నాయి.

వాహనాలపై నేతల బొమ్మలు ఉండకూడదు

చిత్తూరు, మార్చి 20: ప్రభుత్వానికి సంబంధించిన అన్ని వాహనాలపై రాజకీయ బొమ్మలు, గుర్తులు ఉండరాదని ఏఆర్వో, కమిషనర్ అరుణ స్పష్టం చేశారు. బుధవారం ఆమె ప్రభుత్వ సంస్థల వాహనాలైన 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఇంటింటికి రేషన్ సరఫరా చేసే వాహనాలను తనిఖీ చేశారు. అన్ని వాహనాలను వాహనాల షెడ్డుకు తీసుకొచ్చి లోగోలు, ఇతర రాజకీయ పరమైన బొమ్మలు ఉన్నాయా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్యానికి రంగవల్లుల పోటీలు





చిత్తూరు, మార్చి 20: 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని కట్టమంచి చెరువు వద్ద బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓటింగ్ ప్రక్రియ, ఈవీఎంల వినియోగం, ఈవీఎం నమూనా, ఓటరు చైతన్యం, నైతికత అంశాలపై మహిళలు ముగ్గులు వేశారు. వీటిలో ఉత్తమ మూడు ముగ్గులను మెప్మా సిబ్బంది ఎంపిక చేసి.. బహుమతులు అందించారు. స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, ఆర్ఐలు వెంకటేశ్, స్వీప్ బృందం, మెప్మా సీవోలు, మహిళలు పాల్గొన్నారు.

రేకుల షెడ్డు పీకేస్తామంటూ వైసీపీ బెదిరింపులు

చిత్తూరు సిటీ, మార్చి 20: తాము నివాసముంటున్న రేకుల షెడ్డునూ పీకేస్తామంటూ వైసీపీ నేత బెదిరిస్తున్నారని జీడీ నెల్లూరు మండలం రామానాయుడు పల్లికి చెందిన పొన్నుస్వామి ఆరోపించారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 70 సంవత్సరాలుగా తమ అధీనంలో 4 సెంట్ల భూమి ఉందన్నారు. గ్రామస్తుల తీర్మానంతో రెండు సెంట్లను కమ్యూనిటీ భవనానికి ఇవ్వగా, మగిలిన రెండు సెంట్లలో రేకుల షెడ్డువేసుకుని నివాసం ఉంటున్నట్లు చెప్పారు. ఆ రెండు సెంట్లను ఆక్రమించేందుకు అధికార పార్టీనేతలు రేకుల షెడ్డును పీకేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నేతలకు పంచాయతీ కార్యదర్శి వత్తాసుపలుకుతూ తనకు నోటీసు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని, ఉన్నతాధికారుల స్పందించి తనకు, తన భూమికి రక్షణ కల్పించాలని కోరారు.

కోడ్ అంటే లెక్కలేదా?

● నేడు ఆలయ పాలకమండలి సమావేశం

చిత్తూరు కల్చరల్, మార్చి 20: చిత్తూరు నగరం గిరింపేటలోని దుర్గాంబ ఆలయ పాలకమండలి సమావేశం గురువారం నిర్వహించనున్నారు. ఎన్నికల కోడ్‌కు కొంచెం ముందు ఆగమేఘాల మీద పాలకమండలిని నియమించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఆలయ పాలక మండలి ఎలాంటి అధికార కార్యక్రమాలు చేపట్టకూడదు. కేవలం ఈవో మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలి. ఇవన్నీ కాదని పాలకమండలి తమ తొలి సమావేశాన్ని నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం పట్ల విమర్శలు వస్తున్నాయి.

బాణసంచా కేంద్రం పేలుడులో గాయపడిన ఇద్దరి మృతి

సూళ్లూరుపేట, మార్చి 20: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో మంగళవారం బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో గాయపడిన ఆరుగురిలో ఇద్దరు బుధవారం మృతి చెందారు. గాయపడిన ఆరుగురిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నై కేఎంసీ వైద్యశాలకు తరలించారు. శరీరం 90 శాతానికి పైగా కాలిపోయిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ (18), రవి (21) బుధవారం రాత్రి మృతి చెందారు. వీరిద్దరూ టపాసుల తయారీ కేంద్రంలో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు తీవ్రంగా గాయపడిన వత్రపాలేనికి చెందిన శివకుమార్ పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు ఎస్ఐ రహీం రెడ్డి తెలిపారు.

రంగు మారింది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కార్వేటినగరం మండల కాంప్లెక్స్ ప్రవేశద్వారం, ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం గోడలకు వైసీపీ రంగులు మారాయి. ఎన్నికల కోడ్ వచ్చినా ఈ రంగులు అలాగే ఉండటంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎన్నికల అధికారులు ఆ రెండు భవనాలకు వైసీపీ రంగుల స్థానంలో తెల్ల రంగు వేయించారు.

\- కార్వేటినగరం

ఈ రంగుల్ని ఏం చేస్తారు?



పెనుమూరు, మార్చి 20: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నాలుగు రోజులు అవుతున్నా కొందరు అధికారులు ఉదాసీనంగా ఉంటున్నారు. సామిరెడ్డిపల్లి సచివాలయ పరిధిలో ఉగ్రాణంపల్లిలో ఉన్న రైతుభరోసా కేంద్రానికి వైసీపీ రంగులతో ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

వైసీపీ రంగులతో ఉన్న ఉగ్రాణంపల్లి రైతుభరోసా కేంద్రం

ఈ హోర్డింగులు ఎప్పుడు తొలగిస్తారో?



వెదురుకుప్పం, మార్చి 20: వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో ఇంకా పలుచోట్ల హోర్డింగులు, ఫ్లెక్సీల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, గుర్తులు కనిపిస్తూనే ఉన్నాయి. వాటిని కనిపించకుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కిస్తుండటం ఆరోపణలకు తావిస్తోంది.

వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో కోడ్ కూసినా ఇలా..

ఈ నీటి ట్యాంకు మాటేంటి?



కార్వేటినగరం, మార్చి 20: కార్వేటినగరం పంచాయతీ కోట చెరువు దళితవాడ, పద్మసరస్సు వద్ద ఉన్న రెండు నీటి ట్యాంకులకు వైసీపీ రంగులు ఉన్నాయి. పుత్తూరు - చిత్తూరు జాతీయ రహదారి పక్కనే నీటి ట్యాంకులకు వేసిన వైసీపీ రంగులను అధికారులు ఇంకా తొలగించలేదు. కొన్ని ఇళ్లకు జగనన్న నువ్వే మా నమ్మకం అంటూ వేసిన సిక్కర్లనూ తొలగించలేదు. దీనిపై కాంగ్రెస్ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.





బోయకొండ క్రాస్‌లో రెపరెపలాడుతున్న వైసీపీ జెండా - గడ్డంవారిపల్లెలో ఓ ఇంటి ముందు ఉన్న మానమ్మకం నీవే జగన్ బోర్డు

చౌడేపల్లె, మార్చి20: చౌడేపల్లె మండలంలో పలువురు అధికారులు ఎన్నికల కోడ్ పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. బోయకొండ క్రాస్ వద్ద వైసీపీ జెండా ఇప్పటికీ ఎగురుతోంది. గడ్డంవారిపల్లెలో ఓ ఇంటి ముందు మానమ్మకం నీవే జగన్ అనే బోర్డును తొలగించలేదు. జిల్లా ఎన్నికల అధికారి స్పందించి ఎన్నికల కోడ్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల విధులు వద్దు!

● కలెక్టరేట్‌కు క్యూ కడుతున్న ఉద్యోగులు
● ఇప్పటికే 1200 దరఖాస్తుల రాక



విధుల మినహాయింపు కోరుతూ సర్టిఫికెట్లతో డీఆర్వో చాంబర్ వద్ద వేచివున్న ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20: ఎన్నికల విధులు వద్దంటూ పలువురు ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానానికి ఎన్నికల నిర్వహణకోసం రిజర్వుతో కలిపి 12,750 మంది అవసరం. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఎన్నికల విధులకోసం ఎంపిక చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ పేరిట వారందరికీ నియామక ఉత్తర్వులను పంపారు. అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్, గుండె జబ్బు ఉన్నవారు, నడవలేని స్థితిలో వున్నవారు తదితర కేటగిరిలకు చెందిన వారికి మాత్రమే విధుల నుంచి మినహాయింపు ఇస్తున్నారు. కాగా ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని చాలామంది చిన్నచిన్న అనారోగ్య సమస్యలను కూడా సాకుగా చూపుతున్నారు. ఇలా మినహాయింపులు కోరుతూ ఇప్పటివరకు 1200 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజులుగా జేసీ శ్రీనివాసులు ఆ దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారిని గుర్తిస్తున్నారు. బుధవారం 164 మందిని కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు స్వయంగా వచ్చి డీఆర్వో పుల్లయ్య డాక్టర్లచే ధ్రువీకరించిన సర్టిఫికెట్లు తీసుకొచ్చినవారిని పక్కాగా పరిశీలనచేశారు. అర్హత ఉంటే మినహాయింపు ఇస్తున్నారు. లేదంటే విధులకు రావాల్సిందేనని చెప్పి పంపారు. దీంతో దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా మరికొందరు దరఖాస్తులు చేసుకోకుండా డీఆర్వో పుల్లయ్యను కలిసేందుకు చేతిబిడ్డలతో సహా మహిళలు నేరుగా వచ్చారు. మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకున్నవారు తప్ప ఇతరులు నేరుగా కలెక్టర్‌ను లేదా జేసీని సంప్రదించాలని ఆయన చెప్పడంతో వారందరూ వెనుదిరిగారు. ఈ విధంగా రోజుకు వందలాది మంది సర్టిఫికెట్లతో కలెక్టరేట్‌కు వస్తున్నారు. అయితే ఎవ్వరికీ కూడా మినహాయింపు ఇచ్చేది లేదంటూ కలెక్టర్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే.

చిత్తూరుకు చేరిన 1.1 లక్షల ఓటరు కార్డులు



కలెక్టరేట్‌లో ఓటరు కార్డుకు స్టాంపింగ్ వేస్తున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో చివరి విడతగా 1,10,000 ఓటరు కార్డులు జిల్లా కేంద్రానికి చేరాయి. వాటికి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎన్నికల సిబ్బంది స్టాంపింగ్ ప్రక్రియ చేపట్టారు. పోస్టల్ శాఖ వీటిని రిజిష్టర్ పోస్టులో ఓటర్లకు పంపుతుంది. నోడల్ ఆఫీసర్ పర్యవేక్షణలో స్టాంపింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకోసం సమీప మండలాల్లో వీఆర్‌ఏలను రప్పించారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జేసీ



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20: సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో మే13న పోలింగ్ జరుగుతుంది. 21రోజుల విరామం తర్వాత జూన్ 4న ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారిలోని ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలను ఓట్ల లెక్కింపు కేంద్రంగా గుర్తించింది. పోలింగ్ తర్వాత అన్ని నియోజకవర్గాల నుంచి చేరే వీవీ ప్యాట్లను ఇక్కడ ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరచనున్నారు. బుధవారం జేసీ శ్రీనివాసులు ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలు, వాహన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య పాల్గొన్నారు.

టెన్త్ ఇంగ్లీష్ పరీక్షకు 442 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 20: జిల్లాలో బుధవారం జరిగిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 442 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. 21,425 మంది విద్యార్థులకు గాను 20,983 మంది హాజరు కాగా, 442 మంది గైర్హాజరైయారు. ● మధ్యాహ్నం జరిగిన ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలకు 1062 మందికిగాను 996 మంది హాజరుకాగా, 66 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో 3859 మందికి గాను 3723 మంది హాజరు కాగా 136 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఒకటి నుంచి టెన్త్ మూల్యాంకనం

టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పంపిన ఉత్తర్వులు జిల్లాకు చేరాయి. ఈ క్రమంలో పరీక్షల విభాగం అధికారులు స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్పాట్ నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. ఇంటర్మీడియట్ మూల్యాంకనం ఏప్రిల్ 4వ తేదీకి ముగియనుంది.

మళ్లీ వచ్చిన ఏనుగులు



గురిగానివారిపల్లె సమీపంలో వరిపైరును తొక్కేసిన ఏనుగులు

సోమల, మార్చి20: సోమల మండలంలోకి మంగళవారం రాత్రి ఏనుగులు మళ్లీ ప్రవేశించి పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదుం మండలంలో సంచరిస్తున్న ఏనుగులు గురికానివారిపల్లె సమీపంలోని మామిడి, కొబ్బరి, వరి పొలాల్లో సంచరించి పంటలను తొక్కివేశాయి. గురికానివారిపల్లెకు చెందిన కె. మహేశ్వర మామిడి తోటలో సంచరించి 20చెట్ల కొమ్మలను విరిసేయడంతో కోతకు వస్తున్న మామిడి పిందెలు నేలరాలాయి. గుర్రప్పకు చెందిన కొబ్బరి తోటలోను, అమీర్ సాబ్‌కు చెందిన వరి పొలంలో తిరగాడి పంటలను ధ్వంసం చేశాయి. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగుల బెడద నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు. ఈ మేరకు రైతులు బుధవారం సచివాలయం, సోమల తహసీల్దార్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదులు చేశారు.



గుంతలో పడివున్న వాహనాన్ని బయటకు తీస్తున్న స్థానికులు



మృతుడు రుక్మాంగదరెడ్డి (ఫైల్ ఫొటో)

మున్సిపల్ నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

చింతలగుంటలో పార్కు ఏర్పాటు పనులు - పునాదుల కోసం తీసిన గోతిలో పడి ఒకరు మృతి

పుత్తూరు అర్బన్, మార్చి 20:పుత్తూరు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగ అధికారుల నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైంది.నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో జరుగుతున్న పనులకు సంబంధించి కనీస భద్రతా చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లిప్తంగా వ్యవహరించడంతో ఒక కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది.వివరాల్లోకి వెళితే... పుత్తూరు పట్టణానికి చెందిన రుక్మాంగద రెడ్డి(55) లక్ష్మీనగర్‌లో నివాసముంటున్నాడు.బుధవారం మధ్యాహ్నం పట్టణంలోకి వెళ్లి చింతలగుంట మీదుగా ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తున్నాడు.ఈ క్రమంలో మున్సిపల్ పార్కు ఏర్పాటు కోసం ప్రహరీగోడ నిర్మాణంలో భాగంగా తీసిన పునాదుల గుంతలో ప్రమాదవశాత్తూ పడ్డాడు. ద్విచక్ర వాహనం మీద పడడంతో స్పృహ కోల్పోయాడు.అక్కడే పనుల్లో ఉన్న కూలీలు రుక్మాంగదరెడ్డిని బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు లేకపోవడంతో పోలీసు కేసు నమోదు కానట్లు తెలిసింది. చింతలగుంట ఉన్న ప్రదేశంలో విద్యా సంస్థలుండడంతో రద్దీగా ఉంటుంది. ఇదేదారిలో వందలాది మంది విద్యార్థులు, స్థానికులు వెళుతుంటారు. రోడ్డుకు ఆనుకుని పునాదులు తీస్తుండడంతో భద్రతా చర్యలు తీసుకోవాలనే కనీస ఇంగితం కూడా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగానికి లేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం ఇదే పునాదుల గుంతలో కుక్కపిల్ల పడిపోయింది. దానిని బయటకు తీసే క్రమంలో టీడీపీ నాయకుడు షణ్ముగరెడ్డికి, మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి అనుచరుడికి మధ్య జరిగిన దా డి, పోలీసు ఫిర్యాదులు, కేసుల నమోదు వరకు వెళ్లింది. ఆ సంఘటనతోనైనా అధికారులు మేలుకొని ఉండాల్సింది. పునాదుల కోసం తీసిన గుంతల వద్ద బారికేడ్ల ఏర్పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసివుంటే బుధవారం ఒక వ్యక్తి మృతి చెందాల్సిన పరిస్థితి ఉండేది కాదనే మాటలు వినబడుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో మున్సిపాలిటీ దిద్దుబాటు చర్యలు తీసుకుంది. హడావిడిగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేసింది.

విధుల్లో మద్యం తాగిన రుయా ఉద్యోగి సస్పెన్షన్

తిరుపతి(వైద్యం), మార్చి 20: తిరుపతి రుయాస్పత్రి ఆవరణలో విధుల్లో ఉన్న సమయంలోనే మద్యం తాగిన ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.రుయాస్పత్రి ఆవరణలో సీఐటీయూ అనుబంధ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నాలుగు రోజుల కింద వాటర్‌మ్యాన్ నాంపల్లి సుబ్రహ్మణ్యం మరో వ్యక్తితో కలిసి మద్యం తాగుతూ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ విషయంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో స్పందించిన సూపరింటెండెంట్.. విచారణకు ఆదేశించారు. మద్యం తాగింది వాస్తవమేనని తేలడంతో సుబ్రహ్మణ్యాన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, యూఎంహెచ్ఈ యూనియన్ కార్యాలయంలో మద్యం తాగడాన్ని సీఐటీయూ తీవ్రంగా భావించి యూనియన్ అధ్యక్ష పదవి నుంచి సుబ్రహ్మణ్యాన్ని తప్పించడంతో పాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించింది.

నేడు గండబోయనపల్లెలో నల్లారి కిశోర్ పర్యటన

వాల్మీకిపురం, మార్చి 20: వాల్మీకిపురం మండలం గండబోయనపల్లె గ్రామ పంచాయతీలో గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పర్యటించనున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి మండలంలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు అందరూ తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు. తిరుపతి రోడ్డులో టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభించనున్నట్లు తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో క్వారీ కార్మికుడి మృతి


కుకుమా రామ్ మృతదేహం

మదనపల్లె టౌన్, మార్చి 20: మదనపల్లె మండలం బండకాడపల్లె వద్ద ఓ క్వారీలో పనిచేస్తున్న కార్మికుడు మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాజస్థాన్ రాష్ట్రం నాగూర్ జిల్లా జగదీష్‌పురానికి చెందిన నారాయణ రామ్ కుమారుడు కుకుమా రామ్(48) పదేళ్లుగా బండకాడపల్లె సమీపంలోని డీకే క్వారీలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను క్వారీ సమీపంలోని షెడ్డులో అపస్మారక స్థితిలో పడి వుండటం గమనించిన తోటి కార్మికులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్యూటీ వైద్యులు చికిత్స చేస్తుండగానే అతను మృతి చెందాడు. కాగా మృతుడి శరీరంపై రక్తగాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై తాలూకా సీఐ శేఖర్ మాట్లాడుతూ కుకుమా రామ్ ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు అతని కుటుంబీకులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు


నిందితుడిని చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

మదనపల్లె టౌన్, మార్చి 20: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఓ బార్ సర్వర్‌ను ఎస్ఈబీ డీటీఎఫ్ విభాగం పోలీసులు బుధ వారం ఉదయం అరెస్టు చేశారు. మదనపల్లె ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి కథనం మేరకు.. పట్టణంలోని కోకిల బార్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి రామిరెడ్డి గారి లేఅవుట్‌కు చెందిన ఎం. చిన్నమల్లప్ప కుమారుడు, ఎం.జయప్పనాయుడు (54)ను డీటీఎఫ్ ఎస్ఐ హేమ కుమార్ పట్టుకుని 42 ఆంధ్ర మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన బి. నారాయణ నాయక్ కుమారుడు బి.శంకర్ నాయక్(37)ను అదుపులోకి తీసుకుని 60 సాచెట్ల కర్ణాటక మద్యం సీజ్ చేశారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వివరించారు.

నాటుసారా స్వాధీనం

నిమ్మనపల్లి, మార్చి 20: ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముష్టూరు పంచాయతీ పారేసువారిపల్లి సమీపంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి 20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని పారేసు వెంకటరమణ(65)ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు వివరించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


గంజాయి విక్రేత అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కురబలకోట, మార్చి 20: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సద్గురుడు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ముదివేడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ మండలంలోని ముదివేడు పంచాయతీ సాహెబులవారి పల్లెకు చెందిన కమాల్‌బాషా కుమారుడు మహబూబ్ బాషా(46) మరికొంతమందితో కలిసి గంజాయిని విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 7 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసు కుని అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సిబ్బంది ఉమామహేశ్వరరావు, శాంతకుమార్, రవీంద్ర నాయక్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

మదనపల్లె అర్బన్, మార్చి 20: ఆర్టీసీ బస్సుల్లో కలిగే ఇబ్బందులు, ఆర్టీసీ ఉద్యోగుల ప్రవర్తన, సమస్యలు, ఆర్టీసీ ఆదాయం పెంచుకోవడానికి గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వన్ డిపో డీఎం వెంకటరమణా రెడ్డి తెలిపారు. ఈ సమయంలో ప్రయాణికులు, ప్రజలు తమ సమస్యలను ఈ నెంబరుకు 9959225676కు తెలియజేయాలని కోరారు. దీని ద్వారా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి తెస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు.

విజయం సాధించే వరకు విశ్రమించవద్దు

● టీడీపీ శ్రేణులతో నారా భువనేశ్వరి


పీలేరు: టీడీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి

పీలేరు, మార్చి 20: వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే వరకు విశ్రమించ వద్దని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా బుధవారం రాయచోటికి వెళుతున్న ఆమె మార్గమధ్యంలోని పీలేరులో కాసేపు ఆగారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి నేతృత్వంలో పీలేరు-తిరుపతి మార్గంలోని టీడీపీ కార్యాలయం వద్దకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకు న్నారు. అక్కడ తన కోసం వేచి ఉన్న పార్టీ శ్రేణులను నారా భువనేశ్వరి ఆత్మీయంగా పలకరించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పు డు తమ వెంట నిలిచిన వారందరినీ తప్పక గుర్తుంచుకుంటామన్నారు.

కలకడ: కలకడలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులను ఆమెకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి ప్రజలకు అభివాదం చేసి అక్కడే ఉన్న ఓ చిన్నారిని ఎత్తుకుని ముచ్చటించా రు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర తెలుగు యు వత ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్, మద్దిపట్ల వెంకట్రామయ్యచౌదరి, అధికార ప్రతినిధి సూర్యప్రకాశ్, తిమ్మాపురం రఘు రామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కోటపల్లె బాబు, మద్దిపట్ల సూర్యప్రకాశ్ నాయుడు, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, రియాజ్, చిన్నా, శివారెడ్డి, షౌకత్‌అలీ, మహబూబ్ బాషా, జహీర్, పురం రెడ్డమ్మ, రమాదేవి, లక్ష్మీ కాంతమ్మ, సాధన, రెడ్డిరాణి, స్వర్ణ, షమ, నాయకులు ప్రభాకర్‌నాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, తిరుపతి నాయుడు, కాంతారావు, శ్యామల, బరకం శ్రీనివాసులరెడ్డి, మద్దిపట్ల వెంకట రమణ, కోట రమణ, నాగరాజునాయుడు, బి.వి.స్వామి, కోనేని రెడ్డెప్ప నాయుడు, పివి నాయుడు, చంద్రమోహన్, త్యాగరాజు, చంద్రబాబు నాయుడు, సారథి, మల్లికార్జునాయుడు, రైస్‌మిల్ రమణ, ఈశ్వరయ్య, శ్రీనివాసులనాయుడు, ఆనంద్‌రెడ్డి, విశ్వనాథ్, బాలాజిగౌడ్, కరీముల్లా, జిలానీ, ఇర్ఫాన్, అలీ, రెడ్డెప్పనాయుడు, తారక, గీత పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజా సంక్షేమం

● ఉమ్మడి ప్రభుత్వంలో మరిన్ని అమలు..

● టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా


బరిడేపల్లెలో ప్రచారం చేస్తున్న షాజహాన్‌బాషా

మదనపల్లె, మార్చి 20: ప్రజా సంక్షేమానికి ఎన్నడూ లేని విధంగా టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు ప్రకటించిందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా తెలిపారు. బసినికొండ పంచాయతీ గంగమ్మ గుడి కాలనీ(మొలకలదిన్నెక్రాస్)లో గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో బుధ వారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానికుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, యువతకు నిరుద్యోగ భృతి, తదితర పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించిన షాజహాన్‌బాషా.. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని మరోసారి రెట్టింపు స్థాయిలో కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. జనసేన, బీజేపీ మేనిఫెస్టోలు కలిపితే మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువవుతాయన్నారు. వైసీపీకి మరోసారి అవకాశమిస్తే..మరో పదేళ్లు వెనుకబడినట్లేనని, తర్వాత మన ఇళ్లు, ఆస్తులకు కూడా మిగలవని, వారి ఇచ్చే తాయిలాలు, వారు చెప్పే కల్లబొల్లి మాటలకు మోసపోవద్దని ప్రజలను కోరారు. అనంతరం పార్టీ మినీ మేనిఫెస్టోగా ముద్రించిన సూపర్ సిక్స్ కరపత్రాలను ఇంటింటా అందజేశారు. ఈ కార్యక్రమంలో బాబురెడ్డితోపాటు టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ ఎన్.విద్యాసాగర్, నాదెళ్ల రామచంద్రనాయుడు, రమణయ్యనాయుడు, నటశేఖర్, నాగేంద్ర, నారాయణస్వామి, వైకేజీ రమేష్, సుబ్బరాజు, మైనార్టీనేత ఎస్ఎం రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా..

రామసముద్రం: రామసముద్రం మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని మదనపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా తెలిపారు. మండలంలోని చెంబకూరు, కాప్పల్లె, జంగాలపల్లె, మట్లవారి పల్లె, తిరుమలరెడ్డిపల్లె, రామసముద్రం, కురిజల, బరిడేపల్లెల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలు పూలతో షాజహాన్‌కు నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా షాజహాన్ మాట్లాడుతూ రామసముద్రం మండలానికి హంద్రీనీవా నీళ్లు తెప్పిస్తామని, రామసముద్రం నుండి మదనపల్లె రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకుంటామని, మండలంలో టమోటా మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని, పేదలకు విరివిగా ఇళ్లు కట్టించి మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో షాజహాన్‌బాషాను గెలిపించి అసెంబ్లీకి పంపాలని పిలుపునిచ్చారు. రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, రాష్ట్ర మైనార్టీ నాయకులు మస్తాన్, పఠాన్‌ఖాన్, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ విద్యాసాగర్, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, విజయమ్మ, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి అన్వర్‌బాషా, దిగువపల్లెకు చెందిన కృష్ణప్ప, ముళబాగల్ జిల్లా మైనార్టీ నాయకుడు హుస్సేన్ షాజహాన్, మాజీ జడ్పీటీసీ ముని వెంకటస్వామి, సర్పంచ్ ఇంజమం, రెడ్డిశేఖర్, చలపతినాయుడు, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడు, బద్రినాథ్, కృష్ణప్ప, ఎల్. శివ, రమేష్, ఒంటెల అల్తాఫ్, కోవ కృష్ణమూర్తి, చెంగారెడ్డి, హరినాథ్‌రెడ్డి, బండ్ల జనార్దన్, ఉబేద్, కృష్ణంరాజు, శివశంకర్, స్థానికం రాజేష్, బోయ రమణ, వేణుగోపాల్, తిప్పన్న, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం

● టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

● తంబళ్లపల్లెలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ..

● సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం


వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన నాయకులు, కార్యకర్తలు

తంబళ్లపల్లె, మార్చి 20: వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలుకుదామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తంబళ్లపల్లె మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. తంబళ్లపల్లెలోని క్రాస్ రోడ్డు, మగ్గాలిండ్లు, అంబేడ్కర్‌కాలనీ, పరుసతోపు కాలనీ, సిద్దారెడ్డిగారి పల్లెల్లో పర్యటించి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందచేసి వివరించారు. ఇల్లిల్లు తిరుగుతూ ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని.. అధికారంలోకి వస్తే తాము చేయబోయే పనులను వివరించారు. తాను సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగానని.. ప్రజలు, రైతుల కష్టాలు తీర్చడానికి మీ ముందుకు వచ్చానని రాబోయే ఎన్నికల్లో తనకు మద్ధతు ఇవ్వాలని ప్రజలను కోరారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా దోచేసిందని ఆరోపించారు. రాబోయేది కూటమి ప్రభుత్వమేనని.. అధికారంలోకి రాగానే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి.. నిరుద్యోగులు, రైతులు, అన్ని వర్గాల ప్రజల సమస్యలు తీర్చడానికి శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అంతకుముందు తంబళ్లపల్లె క్రాస్ రోడ్డులో టీడీపీ కార్యాలయాన్ని జయచంద్రా రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, గ్రామాధ్యక్షుడు శివ, సీనియర్ నాయకులు తాతిరెడ్డి, తేజమూర్తినాయుడు, డి.చంద్ర, మదన్‌మోహన్‌రెడ్డి, సోముశేఖర్, వీరాంజినేయులు, కాలా నారాయణ, మదన, బీఎంఆర్ రెడ్డప్ప, బేరిశీన, తెలుగు యువత నరసింహులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ మాజీ సభ్యులు రామచంద్ర, చలపతినాయుడు, సుబ్రమణ్యం, జగదీష్, రఘుపతి, మల్లేష్, సుభహాన్, మ్యూజికల్ శివ, టైల్స్ శీనా, పీర్లమాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం టీడీపీలో చేరారు. కోటకొండ మాజీ సర్పంచ్ గాలి మల్లయ్య, సోషల్ మీడియా భార్గవ్‌రెడ్డి, సాంబశివారెడ్డి, షామీర్‌బాషా, దేవా, భానుప్రకాష్, నారాయణరెడ్డి, రాఘవరెడ్డి, నరసింహులు, తిమ్మిరెడ్డితో పాటు పలువురు కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇటువంటిఅరాచక పాలన ఏనాడు చూడలేదని, విద్యాధికుడు, తంబళ్లపల్లె అభివృద్ధి కోసం తపన పడుతున్న నాయకుడు జయచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి, చంద్రబాబు నాయుడును సీఎం చేసేందుకు శాయశక్తులా కృషిచేస్తామన్నారు.

నల్లారి గెలుపుతోనే గ్రామాల అభివృద్ధి


సత్యాపురంలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న తనూజా రెడ్డి

కలికిరి, మార్చి 20: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అభ్యర్థి కిశోర్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి నల్లారి తనూజా రెడ్డి కోరారు. బుధవారం కలికిరి పంచాయతీలోని పలు గ్రామాల్లో ఆమె సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ అంశాలపై ఆమె ఇంటింటికీ వెళ్ళి వివరించారు. కరపత్రాలను పంచిపెట్టారు. చక్కెరవాండ్లపల్లెలో తనూజా రెడ్డికి ఘనంగా స్వాగతం లభించింది. కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ సర్పంచులు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, అంజమ్మ, జడ్పీటీసీ మాజీ సభ్యులు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాలతి, మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, రాజంపేట టీడీపీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, వెంకట రెడ్డి, మధుసూదన రెడ్డి, సహదేవ రెడ్డి, శ్రీమన్నారాయణ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, జనసేన అస్లామ్, నాగరాజ, రెడ్డిప్రసాద్, విజయకుమార్ రెడ్డి, కేవీ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, ఏసురాజు, పీలేరు తెలుగు మహిళ అధ్యక్షురాలు రమాదేవి, అవినాష్ రెడ్డి, రాజన్న, మోహన, సుధాకర్ రెడ్డి, అఫ్రోజ్, రాజేష్, లక్ష్మన్న, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఐయూఎంఎల్ నాయకుడు టీడీపీలో చేరిక

కలికిరి, మార్చి 20: ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌చార్జీ పూల అన్వర్ హుస్సేన్ ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం రాత్రి నగరిపల్లెలో టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. దాదాపు 40 ఏళ్ళుగా వ్యతిరేకంగా వున్న తాము ఇక నుంచి కిశోర్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. ముస్లింలకు టీడీపీతోనే అన్ని విధాల మేలు జరుగుతుందన్నారు. మహల్ పరిసర ప్రాంతాల్లో పాత వారందరితో కలసి సమన్వయంతో టీడీపీ గెలుపు కోసం పనిచేయాలని కిశోర్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ హుస్సేన్, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఐటీడీపీ అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, మాజీ సర్పంచులు మహ్మదాలీ, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, డాక్యుమెంట్ రైటర్ భాస్కర, మైనారిటీ విభాగం అధ్యక్షుడు మున్వర్ ఆలీ, మహ్మదాలీ, బాబ్జి, వెంకట్రమణ, సర్వర్, చాంద్‌బాషా, అసీఫా తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరుతున్న ఐయూఎంల్ నాయకుడు అన్వర్ హుస్సేన్

సీ విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

పెద్దతిప్పసముద్రం మార్చి 20 : ఎన్నికల్లో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వాములను చేసే విధంగా సీ విజిల్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ యాప్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాదారాలతో సహా ఆ యాప్‌లో పొందుపరచవచ్చునన్నారు. ఫొటో, వీడియో, లేదా ఆడియో రూపంలో రికార్డు చేసి అప్‌లోడ్ చేస్తే ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారన్నారు. వంద నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితంగా చర్యలు తీసుకుంటారు. ఈ యాప్‌ను పౌరులు ఎవరైనా వినియోగించుకోవచ్చన్నారు. ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ జనరేషన్‌లో ప్రతి పౌరుడి వద్ద కచ్చితంగా ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటుందన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ కలిగిన ప్రతి ఒక్కరు గూగుల్ ప్లే స్టోర్‌నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. ఇందులో ఎన్నికల నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనైనా సదరు వ్యక్తులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆయా గ్రామాల్లో డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం సరఫరా, ఓటర్లను ప్రభావితం చేసే ఏ విధమైన పనులు చేసినా, ఎన్నికల రోజు వాహనాల్లో తరలించినా రికార్డు చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ యాప్ తెరవగానే తెరపై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయన్నారు. సదరు పౌరులు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలన్నారు.

అందులో మీ లోకేషన్ నమోదు అవుతుందన్నారు. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడు చేసి రాష్ట్రం, నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేస్తే ఆ ఫిర్యాదు నేరుగా ఎన్నికల సంఘానికి చేరుకుంటుందన్నారు. వెంటనే ఎన్నికల అధికారులు రంగంలోకి దిగి ఆ సమస్యపై చర్యలు తీసుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క పౌరుడు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్నికల నిర్వహణలో పోలీసులదే ముఖ్య పాత్ర


కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తదితరులు

నిమ్మనపల్లి, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీసులు విధులు నిర్వర్తించాలని డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సూచించారు. బుధవారం కేంద్ర బలగాలతో కలసి నిమ్మనపల్లి బస్టాండు సర్కిల్‌లో కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా వాహనాల తనిఖీలు చేసి మద్యం, నాటుసారాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నలుగురు కంటే ఎక్కువ మంది గుమికూడకుండా చూడాలన్నారు. ప్రతి రోజు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ప్రతి గ్రామంలోనూ వున్న రౌడీషీటర్లను ముందుగానే అదుపులోకి తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సద్గురుడు, ఎస్ఐ లోకేష్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు


ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న వన్ డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, మార్చి 20: స్థానిక వన్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో గ్రామీణ మార్గాల్లో ప్రయాణించేవారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు మదనపల్లె వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బి.కొత్తకోట రూట్‌లో ఈ నెల ఆర్టీసీలో ప్రయాణించి న వారికి లక్కీడిప్ ద్వారా బహుమతులు అందించారు. ఇందులో మొదట బహుమతి చిన్న పాపమ్మ, రెండో బహుమతి ఆర్ అమరనాథరెడ్డి, మూడవ బహుమతి కె.శ్రీదేవి ఎంపి కైనట్లు డీఎం చెప్పారు. ఏప్రిల్ నెలలో కూడా బి.కొత్తకోట మార్గంలో ప్రయాణించిన వారు బస్సు దిగే ముందే తాము ప్రయాణం చేసిన టిక్కెట్ల వెనుక పేరు. ఊరుపేరు, మొబైల్ నెంబరు రాసి ఆర్టీసీ బస్సులోని గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎంజేఆర్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పీలేరు, మార్చి 20: పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకుడు ఎం. వెంకట రమ ణారెడ్డి తృతీయ వర్ధంతి సంద ర్భంగా బుధవారం ఆ కళాశాల లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో కళాశాలకు చెం దిన 102 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అవినాశ్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మదనపల్లె, పీలేరు ప్రభుత్వ వైద్యశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి, పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యులు ఈశ్వర్ సురేంద్ర, నాగవేణి, మమతా లక్ష్మి, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీ అక్రమాలపై చర్యలేవీ..!


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గుర్రంకొండ, మార్చి 20: ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని టీడీపీ నాయకులు ఆరోపించారు. గుర్రంకొండ బజారు వీధిలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మాజీ సర్పంచ్ నౌషాద్ అహ్మద్, నక్కా సతీష్‌కుమార్ మాట్లాడుతూ గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీలో మసీదు, గుడి వెనుక ఖాళీ స్థలంలో అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారని కలెక్టర్ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ నిర్మాణాలకు పంచాయతీ అధికారులు అనుమతులు ఇవ్వకపోయిన ట్రాన్స్ కో అధికారులు కరెంట్ మీటర్లను ఇచ్చి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ట్రాన్స్‌కో అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏజాజ్ అహ్మద్, విజయ్‌కుమార్, సుబ్బన్న, శ్రీనివాసులు, తన్వీర్, మౌలా, బాబాజాన్, రమణ, హేస్సాన్, ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పీలేరు, మార్చి 20: లింగ నిర్ధారణ పరీక్షల్లో చట్టాలను, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ హెచ్చరించారు. బుధవారం పీలేరు పట్టణంలోని శ్రీనివాస గుప్త స్కానింగ్ సెంటర్, స్టార్ లైట్, శశి, మాధవి, చిన్నారి, ఎస్కేఆర్, శ్రీచక్ర ఆసుపత్రుల్లోని స్కానింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. నిబంధనల మేరకే స్కానింగ్ కేంద్రాలను నిర్వహించాలని ఉషశ్రీ సూచించారు. ప్రభుత్వం కోరిన విధంగా అన్ని నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించాలని ఆదేశించారు. చట్టాన్ని అతిక్రమిస్తున్నట్లు తేలితే జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు. ఆమె వెంట డిప్యూటీ డీఈఎంఓ దేవశిమణి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేశవ రెడ్డి, హెచ్‌ఈ రాజగోపాల్, ఉషారాణి తదితరులున్నారు.

'ఆవిష్కార్'లో మిట్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, మార్చి 20: తమ విద్యార్థులు ఆవిష్కార్ పోటీలలో ప్రతిభ కనబరిచి నట్లు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. సీఎస్ఈ తృతీయ సంవత్సరం విద్యార్థులు విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించి జాతీయ స్థాయి ఆవిష్కార్- స్టూడెంట్ ఇన్నోవేషన్ కాంపిటీషన్ ఫర్ స్టార్టప్ ఐడియా ప్రెజెంటేషన్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రణతి, తనూజా, నాగశ్వేత సెమీ రోబోటిక్ వీడ్ కట్టర్ అండ్ సాయిల్ మానిటరింగ్ సిస్టమ్‌ను ప్రదర్శించి తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి శ్రీదేవిఅభినందించారు.

మదనపల్లె కాంగ్రెస్ టికెట్ బీసీలకు కేటాయించాలి


అజయ్‌సింగ్‌ను కలిసిన వేల్పుల శ్రీధర్

మదనపల్లె అర్బన్, మార్చి 20: మదనపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ అసెంబ్లీ టికెట్ బీసీలకు కేటాయించాలని జిల్లా ఓబీసీ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేల్పుల శ్రీధర్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు ఓబీసీ కెప్టెన్ అజయ్‌సింగ్‌ను కలిసి మదన పల్లె టికెట్ తనకు కేటాయించాలని తన అప్లికేషన్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో అధికంగా ఉన్న బీసీలు ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు.

వైభవంగా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

రాజంపేటటౌన్, మార్చి 20: పట్టణంలోని మన్నూరులో ఉదయగిరి యల్లమ్మ ఆలయం ఏడవ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగుబాళ్లు నిర్వహించారు. పూజారులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఆలయం లో అమ్మవారికి గీతాలు, వెంకటేశ్వర బృందం, సితార ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో భజన సంకీర్తనలు ఆలపించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశరు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు విశేషంగా హాజరయ్యారు.